# అందం

- ముళ్ళపూడి శేష్ కుమార్

"అమ్మా వెళ్ళొస్తా." ఉదయం నుండి అరవై ఆరోసారి అద్దంలో చుసుకుంటూ అరిచింది నళిని. తల్లి జవాబు కోసం ఎదురుచూడకుండా ఆఫీసుకు వెళ్ళటానికి బాగ్ పట్టుకుని గడప దాటేసింది. ఒక ప్రైవేటు కంపెనీలో స్టెనో ఉద్యోగం చేస్తోంది నళిని.

బస్ స్టాప్‌లో షెల్టర్‌లో నుంచుంది బస్‌కోసం ఎదురు చూస్తూ. స్టేజిలో ఒక బోర్డ్‌పై వేసి ఉన్న బస్సు టైమింగ్స్ చూస్తూ ... "ఏనాడూ కరెక్ట్ టైమ్‌కి రాని బస్సులకి ఈ టైంటేబుల్ బోర్డు ఎందుకో?" అన్నాడు బస్సుస్టాపులో నుంచుని ఉన్న ఓ గళ్ళ షర్టు ఆసామి - విసుగ్గా వాచీ చూసుకుంటూ.

"బస్సులు ఎంత ఆలస్యంగా వస్తున్నాయో తెలుసుకోవటానికి." పాన్ నములుతూ నుంచుని ఉన్న మరో పెద్ద మనిషి ఠక్కున సమాధానం చెప్పి తన జోక్‌కి తానే ముసిముసిగా నవ్వుకున్నాడు. గట్టిగా నవ్వితే నోట్లో పాన్ వల్ల చుట్టుపక్కల వాళ్ళకి ప్రమాదం అని కాబోలు!

నళినికి కూడా నవ్వొచ్చి చదువుతున్న అభిమాన రచయిత పరిశోధనాత్మక నవల్లోంచి తల పైకెత్తి నవ్వింది.

ఎదురుకుండా ఓ యువకుడు తన వంకే కళ్ళార్పకుండా చూస్తూ కనపడ్డాడు. ఓ నిముషంపాటు కంగారుపడ్డా ఆ తరువాత లోలోపలే తెగ సంతోషపడిపోయింది. నిజానికి నళిని చెప్పుకోదగినంత అందగత్తె కాదనే చెప్పుకోవాలి. మనం చెప్పుకోవడం కాదు. ఇంతవరకూ ఆమెని చూసి వెళ్ళిన ఏడుగురు పెళ్ళి కొడుకులూ ఇచ్చి వెళ్ళిన సర్టిఫికెట్ అది. అందులో ఓ ముగ్గురు ముప్ఫాతిక వేలు కట్నం ఇస్తే అందం విషయం మరిచిపోవటానికి సిద్ధపడ్డారు - అది వేరే విషయం.

ఇక ఈ భూప్రపంచంలో ఏ మగాడి కంటికీ తను నచ్చదేమో అనే నిర్ణయానికి వచ్చేసింది నళిని. అలాంటి తరుణంలో ఒక యువకుడు - అందునా మంచి ఒడ్డూ, పొడుగూ, చిరంజీవి స్టైల్ క్రాఫ్‌తో హాండ్‌సమ్‌గా ఉన్న యువకుడు తనవైపే రెప్పలార్పకుండా చుస్తూ ఉండటం నళినీని ముందుగా ఒకింత ఆశ్చర్య పరిచినా వెంటనే తేరుకుంది.

పొద్దున అద్దంలో చూసుకున్నప్పుడే అనుకున్నా ఈ వేళ నాకు నేనే ముద్దొచ్చేంత అందంగా కనిపిస్తున్నా నెందుకో అని. అలాంటప్పుడు ఈ యువకుడికి నేను అందంగా కనపడటంతో వింతేముంది అనుకుంది నళిని. వద్దూ అనుకుంటూనే మరోసారి తలెత్తి యువకుడి వంక ఓరగా చూసింది. నళిని చూసిన చూపుకి కొద్దిగా ఖంగు తిన్నాడు కాబోలు తల మరల్చకుండా చూపు మాత్రం పక్కకి తిప్పాడు.

యువకుడి వాలకం చూసిన నళినికి సడన్‌గా తన స్త్రీత్వం గుర్తొచ్చి కాస్త సిగ్గుపడింది.

ఈ అబ్బాయిని ఎక్కడో చూసినట్లుందే. తమ ఇంటి పక్కసందులోని ఇంట్లోనే ఎక్కడో చూసిన గుర్తు. వెళ్ళి పలకరిస్తే, హమ్మో! అలా రోడీలా చూసే బదులు, పోనీ తనే వచ్చి పలకరించచ్చుగా! పాపం! ఇలాంటి విషయాలు నాకు మల్లేనే అతనికి కూడా కొత్తేమో! ఇలా తనలో తానే మథనపడసాగింది నళిని.

"నువ్వో పొట్టి బుడంకాయవి. నీ హైటుకి తగిన పెళ్ళికొడుకు దొరకడం కష్టమే!" అంటూ తన కొలీగ్ కామాక్షి తనపై చేసిన కామెంట్ సడన్‌గా గుర్తొచ్చింది నళినికి. వెంటనే ఆ యువకుడి హైట్ ఎంతో కళ్ళతోనే కొలిచేసింది. బాబోయ్ చాలా హైటే ఉన్నాడే!


ఒక్క నిముషం గుండె బేజారెత్తింది.

అయినా హైట్ ఎక్కువైతే మాత్రం ఏవిటిటా? అమితాబ్ జయభాదురి కంటే ఎంతో పొడుగ్గా ఉన్నాడు. వాళ్ళు ఎంచక్కా కాపురం చేసుకోవటంలేదు. బయటకు వెళ్ళేటప్పుడు బాగా హీల్స్ ఉన్న చెప్పులు వేసుకుంటే సరి! అయినా ఆ యువకుడికి అన్నీ నచ్చబట్టేగా ఎప్పుడు ఛాన్స్ ఇస్తానా, తాళి కట్టేద్దామా అన్నంత ఇదిగా చూస్తున్నాడు.

నళిని మనస్సులో ఆలోచనలు జెట్ స్పీడ్‌లో పరుగెడుతున్నాయి. ఎలాగైనా సరే ఈ రోజే నాన్నగారిని ఆ కుర్రాడి ఇంటికి పంపి విషయాలన్నీ మాట్లాడి ముహూర్తం నిర్ణయించుకురమ్మని చెప్పాలి. అసలే ఈ రోజుల్లో పెళ్ళికొడుకులకి చాలా డిమాండ్. వారం రోజుల క్రితం చూసిన పెళ్ళికొడుకు వారం తిరిగేనరికి చంకలో చంటిపిల్లాడితో కనిపించేస్తున్నాడు. కాబట్టి ఏ మాత్రం ఆలస్యం చేయకూడదు. నళిని మనసులో ఫర్మ్‌గా డిసైడ్ చేసేసుకుంది. ఇంతలో ఓ బస్సు రావటం, ఆ యువకుడు బస్సెక్కి వెళ్ళిపోవడం జరిగిపోయింది.

తన మనసు కూడా ఆ యువకుడితోపాటు బస్సెక్కి వెళ్ళిపోవడంతో నీరసం ఆవహించి ప్రాణంలేని బొమ్మలా నిలబడిపోయింది నళిని. యాంత్రికంగా మళ్ళీ తన అభిమాన రచయిత పరిశోధనాత్మక నవల్లోకి తల దూర్చింది. మళ్ళీ ఎవరో తన ముందు నుంచుని చూస్తున్న అనుభూతి కలగడంతో మళ్ళీ తన హీరో వచ్చాడేమో అన్న ఆశతో గబుక్కున్న తలెత్తి చూసింది. ఓ యాభయ్యేళ్ళ ముసలి హీరో కనపడేసరికి మండు కొచ్చింది. తన వయసు కూతుళ్ళు, కోడళ్ళు ఎంతమంది ఉండి ఉంటారో ఆయనకి. సిగ్గు లేకుండా ఎలా చూస్తున్నాడో. ఈ మగ బుద్ధే అంత - తనలో తానే గొణుక్కుంది నళిని.

కానీ హృదయంలో ఓ మూల "ఈ ముసలాయనికి కూడా ఈ రోజు నేను అందంగా కనపడుతున్నా నన్నమాట" అనుకుని సంతోషపడటం మానలేదు. ఈ రోజు ఉదయం లేచిన దగ్గర్నుండి ఎడం కన్ను అదురుతోంది. అప్పుడే అనుకున్నా ఈ రోజు నాకు మంచిరోజని.






అందరి కంటికీ అందంగా కనపడటం కంటే తనకు ఇంకా మంచి ఏం జరగాలి.

"కానీ ఇలా జుట్టు నెరిసిన తాతయ్యలు కూడా నా వెంట పడితే ఎలా?" చిరాకుపడింది నళిని. నుంచున్న చోట నుండి కదిలి మరోచోటుకి వెళదామా అని ఆలోచిస్తుండగా - "ఊ! వెధవ్వేషాలు వేయకండి, పదండి అక్కడ్నుంచి" అంటూ తాతగారికి సంబంధించిన అమ్మమ్మగారు గదమాయించడంతో తోకముడిచిన కుక్కలా ఆవిడ వెంట కదిలాడు ఆ ముసలి హీరో.

'హమ్మయ్య! పీడా విరగడయింది' సంతోషపడింది నళిని.

అవునూ ఏమిటీ ఈ రోజు మా ఆఫీసు బస్సు ఇంకా రాలేదే, ఏమయిందబ్బా - కొద్దిగా కంగారుపడింది నళిని. ఓ అయిదు నిముషాలు చూసి ఆటోలో వెళితే సరి - అని నిర్ణయించుకుని, మరోసారి నవల్లోకి వెళ్ళబోయింది.

ఇంతలో ఓ పదేళ్ళ బుడతడు ఓ చేత్తో జారిపోతున్న లాగూ పైకి పట్టుకుని, మరో చేత్తో పుస్తకాలు పట్టుకుని నళినీ ముందు కళ్ళార్పకుండా చూస్తూ నిలబడ్డాడు.

త నీ రోజు అందంగా కనపడుతున్న విషయం మరోసారి కన్‌ఫర్మ్ అయినా, సరిగ్గా లాగూ వేసుకోవడం కూడా రాని బచ్చాగాడు సైతం తనకు లైన్ వేయటానికి ప్రయత్నించడం భరించలేకపోయింది నళిని. వేలెడు లేడు వెధవ - అనుకుంటూ వాడికి నాలుగు తగిలిద్దామా అని అనుకునేంతలో ...

"ఒరేయ్ వాసూ! ఇలా రారా అదిగో చూడు" అంటూ ఆ బచ్చాగాడు తన స్నేహితుడిని పిలుస్తూ నళినీ వైపే చూపించాడు వెకిలిగా నవ్వుతూ.

ఆ బచ్చాగాళ్ళిద్దరూ ఒకరి భుజంపై ఒకరు చేతులు వేసుకుని నళినీవైపే కళ్ళార్పకుండా ఖజరహో శిల్పాన్ని చూస్తున్నంత ఆసక్తిగా చూడసాగారు.

నళిని మనసు ఏదో శంకించింది. నెమ్మదిగా వెనక్కి తిరిగింది. కళ్ళు జైంట్ వీల్‌లా తిరిగాయి. హార్ట్ బీటింగ్ హాల్ట్ అయిందా అన్నంత ఫీలింగ్ కలిగింది నళినికి.

యువకుడు, ముసలి హీరో, ఈ బచ్చాగాళ్ళు ఇందాకటి నుండి కళ్ళార్పకుండా చూసింది తన అందాన్ని కాదని, సరిగ్గా తన వెనుకవైపు బస్ షెల్టర్‌పై 'శృంగార వీణ' సినిమా పోస్టర్‌పై అర్ధనగ్నంగా కవ్విస్తూ ఫోజిచ్చిన సినిమా హీరోయిన్ని అన్న నిజం తెలుసుకున్న నళిని తేరుకుని మళ్ళీ మామూలు నళినిగా మారటానికి కాస్త టైమ్ పట్టింది.

తన అందాన్ని చూడటానికి వచ్చే ఎనిమిదో పెళ్ళికొడుకు కోసం ఎదురుచూడక తప్పదన్న నిజాన్ని భరించటానికి సిద్ధపడసాగింది నళిని. ★